క్లుప్తంగా

వినికిడి పరికరాల పంపిణీ



విద్యార్థులకు వినికిడి పరికరాలను అందిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): ఎన్ఆర్ఐ డాక్టర్ భారతి సామి దాతృత్వంతో ఏర్పాటుచేసిన వినికిడి పరకరాలను స్థానిక దొండపాడు పరివర్తన దివ్యాంగుల పాఠశాలలో వినికిడి లోపం ఉన్న 11 మంది పిల్లలకు ఆర్డీఓ అంబరీష్, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్‌కుమార్‌లు మంగళవారం అందజేశారు. డాక్టర్ భారతి సామి చేసిన సాయం అభినందనీయమని వారు అన్నారు. దాత భారతి సామికి పాఠశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస రెడ్డి, కలపాల మురళీ కృష్ణ, సిబ్బంది, విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

హుండీల ఆదాయం లెక్కింపు



వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న వివిధ ఆలయాల్లో మంగళవారం స్వామి వార్ల హుండీల ఆదాయం లెక్కించారు. స్థానిక రామచంద్ర రావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో హుండీ ఆదాయం 75 రోజులకు రూ.7,70,059, బంగారం 50 గ్రాములు, వెండి 8.50 గ్రాముల ఆభరణాలు లభించాయి. 62 రోజులకు హుండీల ఆదాయం పత్తేబాద విఘ్నేశ్వర స్వామి దేస్థానంలో రూ.28,078, చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో రూ.54,700, నాలుగు గుడుల సెంటర్‌లోని కనక దుర్గమ్మ ఆలయంలో రూ.1,72,157 వచ్చింది. హుండీల ఆదాయం లెక్కింపును ఆలయాల కార్యనిర్వహణాధికారి సతీష్ కుమార్ నల్లూరి పర్యవేక్షించారు.

టెట్ నుంచి మినహాయించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఏలూరు జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డిదొర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఐదేళ్ల కంటే ఎక్కువ సర్వీస్ కలిగి టెట్ అర్హత లేని ఉపాధ్యాయులందరూ రెండేళ్లలో టెట్ అర్హతను సంపాదించాలంటూ ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు నిచ్చిందని గుర్తు చేశారు. కానీ 2011లో నాటి ప్రభుత్వం 2011 కంటే ముందు విధుల్లో చేరిన ఉపాధ్యాయులు ఆనాటి ఉపాధ్యాయ నియామక పరీక్షల ద్వారా ఎంపికై ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నందున వారికి టెట్ అర్హతలు అవసరం లేదని ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. ఈ మేరకు ప్రస్తుత ప్రభుత్వం సుప్రీం కోర్టు ఉత్తర్వులపై రివ్యూ పిటిషన్ వేసి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఐఎఫ్‌టీయూ తరగతులపై ప్రచారం

ఏలూరు (టూటౌన్): నవంబర్ 1, 2, 3, 4 తేదీల్లో ఏలూరులో నిర్వహించే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర స్థాయి తరగతులను విజయవంతం చేయాలని కోరుతూ ఇఫ్టూ అనుబంధ ఏపీ బేవరేజ్ హమాలి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం కార్మికుల డిపో వద్ద ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ ఈ తరగతులకు రాష్ట్ర నలుమూల నుంచి 500 మంది ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాచేటి జాను, కోటేశ్వరరావు, గంగాధర్, పాండురంగారావు, కుమారు, శ్రీనివాసరావు, శ్రీధర్, వెంకట్, సాయి, దుర్గారావు, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచాతో తస్మాత్ జాగ్రత్త

- ఏలూరులో గతేడాది తీవ్ర విషాద ఘటన
- కానరాని అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ తనిఖీలు

ఏలూరు టౌన్: వెలుగులు నింపే దీపావళి పండుగను ప్రతి ఒక్కరం ఎంతో సంతోషంగా నిర్వహిస్తాం. బాణసంచా కాల్చుతూ నరకాసురుడి వధను వేడుకగా చేసుకుంటాం. కానీ పండుగ వేళ జాగ్రత్తలు పాటించకపోతే కొన్నిసార్లు తీవ్ర విషాదాన్ని చవిచూడాల్సి వస్తుంది. ఇలా.. గతేడాది దీపావళి రోజు ఏలూరులో చోటుచేసుకున్న ప్రమాద ఘటన నగరాన్ని ఉలిక్కిపడేలా చేసింది. నాటు ఉల్లి బాంబులు పేలిపోవటంతో ఒక వ్యక్తి ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఆ పేలుడు ధాటికి మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరు మృతి చెందారు. మరో వారం రోజుల్లో రానున్న దీపావళి పండుగ సంబరాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

గత ఏడాది విషాదం

ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో స్కూటీపై ఇద్దరు వ్యక్తులు నాటు ఉల్లి బాంబులు తీసుకువెళుతూ ఉండగా, తూర్పువీధి గౌరీదేవి గుడి సమీపంలో ఆకస్మికంగా విస్ఫోటనం జరిగింది. భారీ పేలుడు శబ్దానికి కిలో మీటరు వరకు ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దట్టమైన పొగ కమ్ముకోగా, ఏం జరిగిందో తెలియక ప్రజలు షాకయ్యారు. స్కూటీ నడుపుతున్న వ్యక్తి నడుము కిందిభాగం పేలుడు ధాటికి తునాతునకలు కాగా, స్కూటీ కాలి బూడిదైంది. వెనుక కూర్చున్న వ్యక్తితో పాటు సమీపంలోని మరో ఏడుగురు వ్యక్తులకు సైతం తీవ్ర గాయాలయ్యాయి. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఘటనా స్థలాన్ని



వన్‌టౌన్‌లో దీపావళి టపాసులు పేలి ఒకరు మృతిచెందగా, స్కూటీ కాలిబూడిదైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శివకిషోర్ (ఫైల్)

పరిశీలించి, ఫోరెన్సిక్ నిపుణులతో సైతం విచారణ చేయించారు. ఆ బాణసంచా ప్రమాదం ఏలూరు నగరంలో తీవ్ర విషాదాన్ని నింపిందనే చెప్పాలి.

తనిఖీలు చేయడంలో విఫలం

వన్‌టౌన్ ప్రాంతంలో గతేడాది జరిగిన దారుణ ప్రమాద ఘటనకు భారీ సైజులో తయారు చేసిన నాటు ఉల్లి బాంబులే కారణంగా నిర్ధారించారు. ఇలాంటి నాటు ఉల్లి బాంబులను ఏలూరు పరిసర ప్రాంతాల్లోనే తయారు చేస్తున్నట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఇదే తరహా బాణసంచా తయారీని అరికట్టేందుకు నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది.



గాయపడిన బాధితుడిని ఏలూరు జీజీహెచ్‌లో పరామర్శిస్తున్న ఎస్పీ శివకిషోర్ (ఫైల్)

ప్రతి ఏటా ఏలూరు ఇండోర్ స్టేడియంలో సుమారు 55 బాణసంచా విక్రయ దుకాణాలు ఏర్పాటు చేస్తుంటారు. రెండు, మూడు రోజుల విక్రయాల అనంతరం దీపావళి ముగిసిన తరువాత కొన్ని షాపుల్లో భారీగా బాణసంచా మిగిలిపోతుంటుంది. వీటిని దుకాణాల యజమానులు దాచిపెడుతారు. ఇక కొన్ని బాణసంచా సామగ్రిని కుటీర పరిశ్రమగా తయారు చేసేవారు ఉంటారు. ప్రమాదం జరిగితే హడావుడి చేయటం తప్ప, ముందుస్తుగా నివారణ, జాగ్రత్త చర్యలు చేపట్టటంలో అధికార యంత్రాంగం విఫలం అవుతుందని చెప్పక తప్పదు.

నిబంధనలు పాటించాలి



దీపావళికి ఏలూరు నగరంలో బాణసంచా తయారీదారులు, విక్రయాలు చేసే వ్యాపారులు నిబంధనలు పాటించాలి. ప్రజలు బాణసంచా సామగ్రి పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. పండుగను సంతోషంగా జరుపుకోవాలి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలి. బాణసంచా దుకాణాల్లో మైనర్లను పనికి వినియోగించకూడదు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే లైసెన్సులు రద్దు చేస్తాం.

– డి.శ్రావణ్‌కుమార్, డీఎస్పీ, ఏలూరు

జాగ్రత్తలు తప్పనిసరి

దీపావళి పండుగ సమీపిస్తున్న తరుణంలో ప్రజలు బాణసంచా సామగ్రి పట్ల జాగ్రత్తలు పాటించాలి. బాణసంచా సామగ్రి విక్రయాల దుకాణాల వద్ద అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తల చర్యలు చేపట్టాలి. పర్మినెంట్ లైసెన్సు దారులు తమ షాపుల వద్ద అగ్ని ప్రమాద నివారణకు చర్యలు తీసుకోవాలి. ఇసుక, నీరు భారీగా నిల్వ ఉంచుకోవాలి. మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని అగ్నిమాపక, పోలీస్ అధికారులు ఆదేశిస్తున్నారు.

'జెడ్పీటీసీ పదవి సంతృప్తిని ఇచ్చింది'



జననేతను కలిసిన జెడ్పీటీసీ సరస్వతి (ఫైల్)

దెందులూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఏలూరు జెడ్పీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం ఎంతో సంతృప్తినిచ్చిందని మండల సరస్వతి కొండలరావు అన్నారు. జెడ్పీటీసీగా ఎన్నికై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఏలూరు రూరల్ మండలంలోని ఆమె కార్యాలయంలో తన కార్యాలయంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కొఠారు రామచంద్రరావు కుటుంబం, ఏలూరు రూరల్ మండలం ప్రజలు, పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులందరి కృషితో తాను జెడ్పీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యానని గుర్తుచేశారు. సంక్షేమ ప్రదాత, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి స్ఫూర్తితో ఆయన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, గ్రామ స్వరాజ్యం తోపాటు సంక్షేమ పాలనకు పెద్ద పీట వేశారని వివరించారు.

15న అవగాహన సదస్సు

ఏలూరు(మెట్రో): ఎస్టీ అభ్యర్థులకు, యువ వ్యాపార వేత్తలకు బ్యాంకు సహకారంతో అమల వున్న పథకాలపై ఈనెల 15న ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ, ఏలూరు కార్యాలయపు మీటింగ్ హాలులో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా ఎస్టీ కార్పొరేషన్ ఈడీ ఎం ముక్కంటి ఒక ప్రకటనలో తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

దెందులూరు: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని మలేరియా యూనిట్ ఆఫీసర్ గోవిందరావు అన్నారు. మంగళవారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి ప్రధాన వీధుల్లో ర్యాలీ ప్రచారం నిర్వహించారు. సంపూర్ణ ఆరోగ్యం తోనే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఒక్కరు వ్యక్తిగత సామాజిక ఆరోగ్య పరిరక్షణకు పటిష్టమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. వైద్యాధికారులు ప్రదీప్ చంద్ర, జి.కృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ రామాంజనేయులు, పబ్లిక్ హెల్త్ నర్స్ తులసీ బాయ్, ఆరోగ్య కార్యకర్తలు రాణి, సంధ్య, హెల్త్ అసిస్టెంట్ మేకర్ సత్యనారాయణ, ఆశ కార్యకర్తలు గ్రామస్తులు ఉన్నారు.



చాటపర్రులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆక్వా చెరువుల వివరాలు ఆన్‌లైన్ చేయాలి

ఏలూరు(మెట్రో) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వాకల్చర్ అభివృద్ధి ఆథారిటీ యాక్ట్‌ను అనుసరించి జిల్లాలోని ఆక్వా చెరువుల వివరాలను నిర్దేశించిన సమయంలోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి మత్స్య శాఖాధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ సడా యాక్ట్, ఏపీ ఆక్వాకల్చర్ యాప్‌లో ఆక్వా చెరువుల నమోదు అంశాలపై మత్స్య శాఖాధికారులతో మంగళవారం సాయంత్రం కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో ఆక్వా సాగు విస్తీర్ణం రైతు వారీగా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లాలో 26,582 ఆక్వా చెరువులు ఉన్నాయని, వాటి విస్తీర్ణం, యజమాని పేరు, ఆక్వా సాగు, వినియోగిస్తున్న ఎరువులు, తదితర వివరాలను విలేజ్ ఆక్వాకల్చర్ యాప్‌లో వేగవంతంగా నమోదు చేయాలని కోరారు. అనుమతి లేకుండా ఎక్కడా ఆక్వా సాగు చేస్తే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ నర్సయ్య, మండల స్థాయి మత్స్య అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

లింగ వివక్షను అరికట్టాలి

దెందులూరు : లింగ వివక్షను అరికట్టేందుకు తల్లిదండ్రులతో పాటు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పీజే అమృతం అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆడ మగ తేడా లేకుండా అన్ని రంగాల్లో వారిని ప్రోత్సహించాలన్నారు. లింగ వివక్షత లేని సమాజ ఆవిర్భావానికి కృషి చేయాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్టు విచారణలో తేలితే సంబంధిత స్కానింగ్ సెంటర్లు సీజ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా డెమో పి.శ్రీనివాసరావు, చాటపర్రు పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రదీప్ చంద్ర, జి.కృష్ణ, ఎంపీహెచ్ఓ రామాంజనేయులు, పీహెచ్ఎస్ మోహన్‌బాయ్, ఎంఎల్‌హెచ్ పి.జాహ్నవి, అనూష, ఏఎన్ఎంలు సంధ్యారాణి, జోషి, ఆశ కార్యకర్తలు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అమృతం

విద్యుత్ ఉద్యోగుల సమ్మెకు మద్దతు

ఏలూరు (టూటౌన్): విద్యుత్ ఉద్యోగులు ఈనెల 15 నుంచి చేపట్టే సమ్మెలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) కూడా పాల్గొంటుందని యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు డీఎన్‌వీడీ ప్రసాద్, అధ్యక్షుడు ఆర్ లింగరాజు, నాయకులు జి.మోహన్, పి.ప్రసాద్‌లు మంగళవారం తెలిపారు. రెగ్యులర్ ఉద్యోగులకు పెండింగ్ డీఏలు విడుదల చేయాలని, వయో పరిమితి పెంచాలని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, పీస్ రేట్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం ఇవ్వాలని కోరుతూ నిర్వహించే సమ్మెలో ఉద్యోగులు కార్మికులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు విమర్శించారు. మున్సిపల్ కార్మికులు సమస్యల పరిష్కారం కోరుతూ ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. 12వ పీఆర్సీ ప్రకటించి, 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని, మరణించిన, పదవీ విరమణ పొందిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను ఔట్‌సోర్సింగ్ విధానంలో విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జనాభాకు అనుగుణంగా కార్మికుల నిష్పత్తిని పెంచాలని, పర్మినెంట్ కార్మికుల పెండింగ్ బకాయిలు తక్షణం విడుదల చేయాలన్నారు. కార్మికుల పదవీ విరమణ వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని, కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి మున్సిపల్ కాలనీలో నిర్మించాలని కోరారు. ఈ మేరకు నవంబర్ 3 నుంచి పూర్తిస్థాయిలో సమ్మెకు సమాయత్తం అవుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డిగార్ల నాగబాబు, కార్యనిర్వాహక అధ్యక్షుడు యలగాడ శివకుమార్, యూనియన్ సభ్యులు బంగారు రాజు, బంగారు సురేష్, నాగేశ్వరరావు, అర్జీ సత్యవతి, బంగారు అక్కమ్మ, తోట శాంతి, బంగారు లక్ష్మి, పద్దాది భవాని, భాస్కరరావు, కోన మధుమతి, మాదుగుల భవాని, పైడి శంకర్, తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

వినూత్న హెచ్చరిక



రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత వద్ద హెచ్చరికగా ఉంచిన కుర్చీ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం–ఏలూరు రోడ్డులో గుంత ఉంది జాగ్రత్త అంటూ వినూత్న హెచ్చరికను ఏర్పాటు చేశారు. రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలో నీరు నిల్వ ఉంది. ఈ రోడ్డులో వెళ్లే వాహనదారులకు గుంత వలన ప్రమాదాల బారిన పడకుండా ఉండేలా గొయ్యి ముందు ఒక కుర్చీని ఏర్పాటు చేశారు. జంగారెడ్డిగూడెం–ఏలూరు రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డులో అడుగడుగునా గుంతలు ఉన్నాయి. వర్షపు నీరు ఆ గుంతల్లో చేరడంతో వాటిని అంచనా వేయలేక పలువురు గాయాలపాలవుతున్నారు. దీంతో ముందు పెద్ద గుంత ఉందని, ఆగి వెళ్లకపోతే పడిపోతావని హెచ్చరిస్తున్నట్లు స్థానికులు కుర్చీని గుంత ముందు ఏర్పాటు చేశారు.

అనుమతి లేని బాణసంచా విక్రయాలపై చర్యలు



బాణసంచా దుకాణాల స్థలాలను పరిశీలిస్తున్న సీఐ, తహసీల్దార్

టి.నరసాపురం: అనుమతులు లేకుండా మందుగుండు సామగ్రి విక్రయాలు చేస్తే చర్యలు తప్పవని జీలుగుమిల్లి సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని మండలంలోని బొర్రంపాలెం, టి.నరసాపురం గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న దీపావళి బాణసంచా దుకాణాల స్థలాలను మంగళవారం ఎస్సై ఎం.జయబాబు, తహసీల్దార్ టి.సాయిబాబా సిబ్బందితో పరిశీలించారు. దుకాణాల ఏర్పాటుదారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాణసంచా సామగ్రి దుకాణదారులు తప్పనిసరిగా అనుమతులు పొందాలని తెలిపారు. ప్రతి షాపులో అగ్ని నిరోధక సామగ్రి ఉంచాలని తెలిపారు. ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులు ట్యాంకర్లు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో ఫణి కుమార్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఈ–పంట, ఈకేవైసీ పూర్తి చేయాలి

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఈ–పంట, ఈకేవైసీ పనులు నూరుశాతం త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి వ్యవసాయాధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ నుంచి టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో 4.92 లక్షల ఎకరాలకు సంబంధించి ఈ–పంట నమోదు చేయాల్సి ఉండగా, 96.6 శాతం 4.77 లక్షల ఎకరాల్లో పూర్తిచేసి, రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచామని కలెక్టర్ తెలిపారు. ఇందులో 1.85 లక్షల ఎకరాల్లో వరి సాగు ఉందని చెప్పారు. ఈకేవైసీ పూర్తయితేనే తుఫాను, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు బీమా, పరిహారం వర్తిస్తుందని తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా, వ్యవసాయ శాఖ ఏడీలు, మండల వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	30
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	32
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	16
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	27
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	29
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	21
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	32
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	31
ఏలూరు – తిరుపతి	16.00	4830	31

16న బీకేఎంయూ జిల్లా సమావేశం

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశం ఈ నెల 16న ఉదయం 10 గంటలకు స్థానిక స్ఫూర్తి భవనంలో ఏర్పాటు చేశామని బీకేఎంయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కంచర్ల గురవయ్య, బండి వెంకటేశ్వరరావు తెలిపారు.

ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి విడనాడాలి

కుక్కునూరు: ప్రభుత్వం విలీన మండలాలకు స్త్రీశక్తి పథకాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యాన్ని విడనాడాలని ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా కమిటీ కార్యదర్శి షేక్ మున్ని పేర్కొన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఆగస్టు 15న ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన ఫ్రీ బస్సు పథకం విలీన మండలాల మహిళలకు అందకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకం ప్రారంభించిన వెంటనే ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు సర్వీసులను ఆపి వాటి స్థానంలో అల్ట్రా డీలక్స్ సర్వీసులను ఏర్పాటు చేశారని వాటితో మహిళలకు ఫ్రీ పథకం అమలు కాకపోగా పురుషులు అదనపు చార్జీలు చెల్లించాల్సి వస్తుందని మండిపడ్డారు.

వసతి గృహాల ఆకస్మిక తనిఖీ



గిరిజన బాలుర వసతి గృహంలో సరుకులను పరిశీలిస్తున్న డీడీ

బుట్టాయగూడెం: గిరిజన సంక్షేమ వసతి గృహాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కేఆర్‌పురం ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పి.జనార్ధన్‌రావు వార్డెన్లను ఆదేశించారు. మండల కేంద్రమైన బుట్టాయగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ కళాశాల బాలికల వసతి గృహాన్ని, గిరిజన సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహాన్ని మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా రికార్డులను పరిశీలించారు. అలాగే నిత్యావసర వస్తువులు, కూరగాయల స్టోర్‌ను పరిశీలించి స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లోని మరుగుదొడ్లను పరిశీలించారు. బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరడంతో త్వరలోనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దీని కోసం మండలంలోని ఇప్పలపాడు సమీపంలో ఉన్న ఐటీఐ కళాశాలలోని బిల్డింగ్‌కు మార్చే ఆలోచన చేస్తున్నామని చెప్పారు. దీనికి సంబంధించి ఐటీడీఏ పీఓ రాములు నాయక్ కూడా రెండు రోజుల్లో పరిశీలించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏటీడబ్ల్యూఓ జనార్ధన్, వార్డెన్లు తామా వెంకటేశ్వరరావు, నిర్మల తదితరులు పాల్గొన్నారు.